సాక్షి
అనంతపురం
శుక్రవారం। 30। ఆగస్టు। 2024



టన్ను చీనీ రూ.23 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23 వేలు ప్రకారం విక్రయాలు జరిగాయి.



ఫలితాల విడుదల

జేఎన్‌టీయూ ఎంటెక్, ఎంబీఏ సెమిస్టర్ రెగ్యులేషన్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. వర్సిటీ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు.



జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి.

న్యూస్‌రీల్

తెలుగు భాషాభివృద్ధికి కృషి



గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్

అనంతపురం అర్బన్: తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొని గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలుగుభాష అభివృద్ధికి జిల్లా యంత్రాంగం తరఫున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ తల్లి లాంటి తెలుగుభాషను గౌరవిస్తూ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలుగుభాష గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డీఈఓ వరలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

31నే పింఛన్లు పంపిణీ చేయాలి

అనంతపురం అర్బన్: ఎన్‌టీఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రత పింఛన్లను 31వ తేదీనే పంపిణీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పింఛన్ల పంపిణీ అంశంపై కలెక్టర్ గురువారం కలెక్టరేట్ నుంచి జిల్లా, డివిజన్, మండల అధికారులు, మునిసిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగిన సూచనలు ఇచ్చారు. ఒకటో తేదీ ఆదివారం అయినందున ఒక రోజు ముందే 31వ తేదీన పింఛన్ల పంపిణీ చేపట్టాలన్నారు. బ్యాంకుల నుంచి శుక్రవారమే డబ్బు డ్రా చేసి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. 31వ తేదీ ఉదయం 5.45 గంటల నుంచి పంపిణీ ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్‌డీఏ పీడీ ఓబుళమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రూ.15 లక్షల విలువైన ఎరువుల అమ్మకాల నిలిపివేత



అనుమతి లేకుండా నిల్వ చేసిన ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ రవి, ఏఓ శశికళ

అనంతపురం అగ్రికల్చర్: అనుమతి లేకుండా నిల్వ చేసిన రూ.15 లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాలు నిలిపివేస్తూ (స్టాప్ సేల్స్) ఉత్తర్వులు ఇచ్చినట్లు అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి తెలిపారు. రూరల్ మండలం ఏఓ జే.శశికళతో కలిసి గురువారం త్రివేణి అగ్రో ఏజెన్సీస్, విస్తా అగ్రి గ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన గోడౌన్ ఔట్‌లెట్లలో తనిఖీలు చేపట్టారు. విస్తా అగ్రి గ్రీన్‌టెక్‌లో అనుమతి లేకుండా నిల్వ చేసిన 25 కిలోల బరువున్న 729 వాటర్ సాల్యుబల్ విస్తా ఎరువులను గుర్తించి వాటికి స్టాప్‌సేల్స్ ఉత్తర్వులు ఇచ్చారు. సరైన అనుమతి పత్రాలు, ఇతరత్రా డాక్యుమెంట్లు ఇవ్వకుంటే సీజ్ చేసి 6-ఏ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అంతవరకు అమ్మకాలు సాగించడానికి వీలులేదన్నారు. ఎంఆర్‌పీకి మించి అమ్మకాలు సాగించినా, రైతుకు ఒరిజినల్ బిల్లు ఇవ్వకున్నా, లైసెన్సులు లేకుండా, నిషేధిత ఉత్పత్తుల క్రయ విక్రయాలు సాగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'మెగా' సప్లి దరఖాస్తు గడువు పెంపు

అనంతపురం సెంట్రల్: ఎస్కే యూనివర్సిటీ పరిధిలో నిర్వహించనున్న 'మెగా సప్లిమెంటరీ పరీక్షల'కు సంబంధించి దరఖాస్తు గడువు పెంచినట్లు పరీక్షల విభాగం సంచాలకులు ఆచార్య జీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 18 వరకూ గడువు పొడిగించామన్నారు. విద్యార్థుల సౌలభ్యం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

31న స్పాట్ అడ్మిషన్లు..

ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏపీఈసెట్-2024 ద్వారా అడ్మిషన్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఖాళీలకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9492273714 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి



కోల్‌కతా మెడికల్ కళాశాలలో పీజీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను ఏపీజీడీఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా తీవ్రంగా ఖండిస్తున్నా. దోషులకు ఉరి శిక్ష పడితేనే మళ్లీ ఇలాంటి ఘటనలు జరగవు. ప్రాణాలు కాపాడే డాక్టర్లను ప్రభుత్వాలు కాపాడాలి. వైద్యులకు రక్షణ కల్పించేలా, విధులు సక్రమంగా నిర్వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చి భరోసా కల్పించాలి. ఈ దిశగా వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలి.

–డాక్టర్ బి.రమణనాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీజీహెచ్, అనంతపురం



ప్రజలు వివేచనతో ఆలోచించాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో వార్డుల్లోకి రోగుల సహాయకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. దీంతో ఇన్‌ఫెక్షన్ శాతం పెరిగే అవకాశం ఉంటుంది. చిన్న సమస్యకు వైద్యులు, సిబ్బందిపై నోరుపారేసుకున్న ఘటనలను చూస్తున్నాం. రోగులకు మెరుగైన వైద్యం అందివ్వాలనే ఆలోచనే ఉంటుందని కానీ ఎటువంటి నిర్లక్ష్యం ఉండదు. ప్రజలు వివేచనతో ఆలోచించాలి.

– డాక్టర్ ప్రవీణ, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ వైద్యుల సంఘం

నష్టాల పాలు



పాడిని నమ్ముకుని జీవనం సాగించే పేద వర్గాల సంక్షేమమే ధ్యేయంగా గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'పాలవెల్లువ' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పాలసేకరణ చేపట్టింది. అంతవరకు తక్కువ ధరకే పాలను సేకరిస్తూ పాడి రైతులను దోపిడీ చేస్తున్న పలు ప్రైవేట్ డెయిరీలకు కళ్లెం వేసింది. నాణ్యతా ప్రమాణాలను బట్టి లీటర్‌పై రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా అమూల్ సంస్థ ఇవ్వడంతో పాడి రైతులకు వరంగా మారింది. ఎంతో గొప్ప ఆశయంతో గత ప్రభుత్వం చేపట్టిన ఆ కార్యక్రమానికి చంద్రబాబు సర్కారు మంగళం పాడి రైతులకు నష్టాలు తెచ్చిపెడుతోంది.



అమూల్ పాలవెల్లువ కార్యక్రమంలో మహిళా పాడి రైతుల సమావేశం (ఫైల్)

- అమూల్‌ను కాటేసిన కూటమి సర్కారు
- పాడి రైతులకు మంచి ధరలు ఇస్తున్నా బలవంతంగా నిలిపివేత
- ఈనెల 11 నుంచి జిల్లాలో పాలసేకరణ ఆపేసిన అమూల్ సంస్థ
- ప్రైవేట్ డెయిరీలకు మేలు జరిగేలా చంద్రబాబు సర్కారు ప్లాన్
- అమూల్ బంద్ కావడంతో ధరలు తగ్గించేసిన ప్రైవేట్ డెయిరీలు
- లీటర్‌పై రూ.10 నుంచి రూ.20 వరకు కోతతో రైతులకు నష్టాలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో మొదటి విడతగా ఈ ఏడాది ఫిబ్రవరి 27న అమూల్ పాల సేకరణ మొదలైంది. 15 వేల లీటర్ల లక్ష్యంగా చేపట్టిన పాలసేకరణ తొలిరోజు 3,200 లీటర్లతో ఆరంభమైనా.. కేవలం 15 రోజుల్లోనే లక్ష్యాన్ని చేరుకుంది. అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, ఆత్మకూరు, రాప్తాడు, నార్పల మండలాల్లో 54 ఆర్‌బీకేల పరిధిలో 99 గ్రామాల నుంచి ఉదయం, సాయంత్రం పాలసేకరణ చేపట్టారు. గ్రామాల్లో మహిళల ద్వారా సొసైటీలు ఏర్పాటు చేసి పాల సేకరణకు అవసరమైన అనలైజర్, అధునాతన బిల్లింగ్ మిషన్, ఇతర సామగ్రి అందజేశారు. 9 ప్రాంతాలను పాల రూట్లుగా విభజించి అక్కడి నుంచి సేకరించిన పాలను కొర్రపాడు, రాచానపల్లిలో ఏర్పాటు చేసిన బల్క్ మిల్క్ కూలింగ్ (బీఎంసీ) సెంటర్లకు, అక్కడి నుంచి అమూల్ ప్రధాన డెయిరీలకు తరలిస్తూ విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చారు. ప్రతి 10 రోజులకు క్రమం తప్పకుండా బిల్లుల చెల్లింపు, ప్రోత్సాహకాలు అందించారు. కొవ్వు, వెన్నశాతం లాంటి నాణ్యతను బట్టి ఆవు పాలు లీటర్‌కు రూ.40 నుంచి 42, గేదెపాలు లీటర్‌కు రూ.70 నుంచి రూ.80 వరకు అమూల్ సంస్థ చెల్లింపులు చేసేది. జిల్లాలో రోజూ 980 మంది పాల ఉత్పత్తిదారులు అమూల్‌కు పాలుపోసేవారు. 10 రోజులకు రూ.90 లక్షల వరకు, నెలకు రూ.2.70 కోట్ల మేర చెల్లింపులు చేసేవారు. అమూల్ రంగ ప్రవేశంతో పోటీని తట్టుకునేందుకు ప్రైవేట్ డెయిరీలు కూడా ధరలు పెంచడంతో పాడి రైతులకు మెరుగైన లాభాలు లభించాయి.

రైతులకు తీరని నష్టం..

హెరిటేజ్‌తో పాటు ఇతర ప్రైవేట్ డెయిరీలకు మేలు చేసే క్రమంలో పాడి రైతుల పాలిట వరంగా మారిన అమూల్ సంస్థపై కూటమి సర్కారు కన్నుపడింది. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే అమూల్‌కు సహకరించకూడదని డెయిరీ, పశుశాఖ, సహకార, డీఆర్‌డీఏ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇలా కూటమి సర్కారు కాటు వేయడంతో అమూల్ పాలసేకరణకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో ఈనెల 11 నుంచి తమ కార్యకలాపాలు బంద్ చేస్తున్నట్లు బలవంతంగా అమూల్ సంస్థ ద్వారా ప్రకటన చేయించారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం హెరిటేజ్ 9 వేల లీటర్లు, గాయత్రి 12 వేల లీటర్లు, దొడ్ల డెయిరీ 10 వేల లీటర్లు, సంగం 5 వేల లీటర్లు, అలాగే శ్రీజ, తిరుమల, ఆరోఖ్య, కర్నూలు విజయ తదితర ప్రైవేట్ డెయిరీలు రోజువారీగా 50 వేల నుంచి 60 వేల లీటర్లు పాల సేకరిస్తున్నాయి. అమూల్ బంద్ కావడంతో నేడు ప్రైవేట్ డెయిరీలు పాల ధరలు లీటర్ మీద రూ.10, అంతకన్నా ఎక్కువగానే తగ్గించడంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అమూల్ కావాలంటూ ఇటీవల రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేయడంతో పాటు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించినా కూటమి సర్కారు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్లు కూడా లేదని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో పశుసంపద ఇలా..

పాడి ఆవులు	2.16 లక్షలు
పాడి గేదెలు	1.90 లక్షలు
మొత్తం	4.06 లక్షలు
రోజువారీ పాల ఉత్పత్తి	1.20 లక్షల నుంచి 1.30 లక్షల లీటర్లు

ఆవులు అమ్మేద్దామనుకుంటున్నాం



అప్పు చేసి ఐదు పాడి ఆవులను రూ.4.50 లక్షలకు కొన్నాం. రోజూ 40 లీటర్ల పాలను డెయిరీకి పోస్తున్నా. గతంలో అమూల్ డెయిరీ ద్వారా లీటర్‌కు రూ.44 వచ్చేది. ఇప్పుడు హెరిటేజ్ డెయిరీకి పోస్తుండడంతో లీటర్‌కు పాల ధర రూ.27 నుంచి 30 మాత్రమే వస్తోంది. 5 ఆవులకు కలిపి నెలకు 1,200 లీటర్లు అనుకున్నా, లీటర్ రూ.30 అయితే రూ. 36 వేలు బిల్లు వస్తుంది. ఆవులకు దాణా కోసం నెలకు దాదాపుగా రూ.30 వేలు, పశు గ్రాసం కోసం రూ.5 వేల ఖర్చు పోతే మిగిలేది రూ. వెయ్యి మాత్రమే. అమూల్ డెయిరీకి పాలు పోయడం ద్వారా నెలకు దాదాపుగా రూ.15 వేల నుంచి రూ.20 వేలు మిగిలేది. ఇప్పుడు నెలకు వెయ్యి మాత్రమే మిగలడంతో ఆవులను అమ్మేద్దామనుకుంటున్నాం.

– చదివే రోజా, పాడి రైతు, బుక్కచెర్ల, రాప్తాడు మండలం

గిట్టుబాటు కావడం లేదు



నాకు రెండు ఆవులున్నాయి. రోజూ 20 లీటర్ల పాలను డెయిరీకి పోస్తున్నాం. గతంలో అమూల్ డెయిరీకి పోసేటప్పుడు లీటర్‌కు రూ. 40 గిట్టుబాటు అయ్యేది. ఈ మధ్య వర్షాల కారణంగా పచ్చిమేత లభ్యమవుతోంది. దీంతో పాల ఉత్పత్తి పెరిగింది. కావాల్సిన పాలకంటే ఎక్కువగా వస్తున్నాయని పాలను డెయిరీ వాళ్లు వెనక్కు పంపుతున్నారు. లీటర్‌ను రూ.10 దాకా ధర తగ్గించారు. ఇప్పుడు రూ.30 కంటే తగ్గింది. ఈ రేట్లతో పాడి ఆవులను మేపడం కష్టంగా ఉంది. ధరల విషయంలో పాల డెయిరీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. పాడి ఆవులకు దాణా, మేత పెట్టి పోషించడం వల్ల కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు.

– మారక చెన్నమ్మ, పాడి రైతు, ఎం.బండమీదపల్లి, రాప్తాడు మండలం

గతంలో కంటే తక్కువ ఆదాయం



మా గ్రామంలో అమూల్ డెయిరీ ఏర్పాటు చేసినప్పుడు ఆవులను కొనుగోలు చేశాం. రోజుకు 20 లీటర్ల పాలు డెయిరీకి పోసే వాళ్లం. గతంలో లీటరుకు రూ.38 నుంచి రూ.40 వరకు ఇచ్చారు. దాదాపు రోజుకు రూ.700 వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం అమూల్ డెయిరీని తీసేయడంతో ప్రైవేటు డెయిరీలకు పాలు పోస్తున్నాం. గతంలో కంటే తక్కువ ఆదాయం వస్తోంది.

– శిరీష, పంపనూరు తండా, ఆత్మకూరు మండలం

లీటర్ రూ.30 మించడం లేదు



ఆవు పాల ధర బాగా ఉండటంతో 10 ఆవులు కొనుగోలు చేశా. రోజుకు 50 లీటర్ల పాలు అమ్మేవాణ్ని. మా గ్రామంలో అమూల్ డెయిరీ కూడా ఏర్పాటు చేశా. రోజుకు 300 లీటర్ల పాలు వచ్చేవి. లీటరు ఆవు పాల ధర రూ.38కి తగ్గేది కాదు. ప్రస్తుతం అమూల్ డెయిరీ తొలగించడంతో ప్రైవేటు డెయిరీకి పాలు పోస్తున్నా. లీటరు రూ.30కి మించి ఇవ్వడం లేదు.

–అశోక్ నాయక్, పంపనూరు తండా, ఆత్మకూరు మండలం

పాడి రైతులు నష్టపోతున్నారు



కొవ్వు శాతం బట్టి గతంలో లీటర్ ఆవు పాలకు రూ.38 వరకు వచ్చేది. ఇటీవల లీటరుకు రూ.8 వరకు తగ్గింది. పాల ధర తగ్గడం వల్ల పాడి రైతులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

– వరలక్ష్మి, పాడి రైతు, ఆత్మకూరు

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా, వ్యాయామం, ఏదో ఒక క్రీడను ప్రతి రోజూ అర గంటపాటు చేయాలన్నారు. తద్వారా శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉంటామన్నారు. అనంతరం జిల్లాస్థాయి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డులను విద్యార్థులకు ప్రదానం చేశారు. మొదటి స్థానం బుక్కరాయసముద్రం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ద్వితీయస్థానం పెన్నహోబిలం ఎంజేపీ, ఏపీ బీసీ డబ్ల్యూఆర్ఎస్ విద్యార్థులు సాధించారు. తృతీయస్థానం గార్లదిన్నె ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు, నాల్గో స్థానం కొనకొండ్ల జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు, ఐదో స్థానంలో పాల్తూరు జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డీఈఓ వరలక్ష్మి, డిప్యూటీ డీఈఓలు తదితరులు పాల్గొన్నారు.



బీకేఎస్ క్రీడాకారులకు అవార్డు అందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్

సోలార్ కంపెనీల ఏర్పాటుకు చర్యలు

కళ్యాణదుర్గం: సోలార్ కంపెనీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. గురువారం సాయంత్రం కళ్యాణదుర్గం మండలంలోని తిమ్మసముద్రం వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో సోలార్ పార్క్ ఏర్పాటు కోసం కేటాయించిన భూములను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ కంపెనీలకు భూములను చూపి వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మిత, ఏపీఐఐసీ జూనియర్ మేనేజర్ సాగర్, తహసీల్దార్ భాస్కర్, సర్వేయర్ షేక్షావలి, డీటీలు నాగరాజు, వెంకటేశులుతో పాటు పలువురు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష తగదు

అనంతపురం కార్పొరేషన్: హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష తగదని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన 5కే మారథాన్‌ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల అవగాహన కల్గి ఉండాలన్నారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో జీవిస్తున్న వారి పట్ల ప్రేమాభిమానాలు కల్గి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమజేమ్స్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వి భాస్కర్ తదితరులున్నారు.

❐ హెచ్ఐవీపై అవగాహన కల్పించడంలో భాగంగా నిర్వహించిన 5కే మారథాన్ ఆకట్టుకుంది. ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, సర్వజనాస్పత్రి, కోర్టు రోడ్డు మీదుగా సాగింది. బాలుర విభాగంలో మొదటి బహుమతి నవీన్, రెండవ బహుమతి గురు రవితేజ, బాలికల విభాగంలో మొదటి బహుమతి శిరీష, రెండో బహుమతి వై ఆశ్రీషా షా పొందారు. ట్రాన్స్‌జెండర్స్ విభాగంలో మొదటి బహుమతి సత్య, రెండో బహుమతి మెహర్ అందుకున్నారు.

డాక్టర్ నిర్లక్ష్యంతోనే ప్రాణం పోయింది

- డీఎంహెచ్ఓ ఎదుట మిస్బాకౌసర్ తల్లిదండ్రుల ఆవేదన



బాలిక తల్లిదండ్రులను విచారిస్తున్న డీఎంహెచ్ఓ

కణేకల్లు: డాక్టర్ నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ ప్రాణాలు పోయాయని డీఎంహెచ్ఓ ఎదుట బాలిక మిస్బా కౌసర్ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన మిస్బా కౌసర్ (9) డెంగీతో సోమవారం మృతి చెందిన విషయం విదితమే. డాక్టర్ విజయకుమార్ నిర్లక్ష్యంతోనే మిస్బా మృతి చెందిందని ఆరోపిస్తూ తల్లిదండ్రులు, బంధువులు మంగళవారం ఆసుపత్రిని ముట్టడించి ఆందోళన చేపట్టారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో డీఎంహెచ్ఓ బీఎస్ దేవి గురువారం విచారణ చేపట్టారు. తొలుత ఆసుపత్రికి వెళ్లి మిస్బాకు ఏ ఇంజెక్షన్లు వేశారు? ఎన్ని సెలైన్ బాటిళ్లు ఎక్కించారు? ట్యాబెట్లు ఏవిచ్చారనే విషయాలను డాక్టర్ విజయకుమార్, స్టాఫ్ నర్సును అడిగి తెలుసుకొన్నారు. ఆ తర్వాత మృతురాలి ఇంటికెళ్లి తల్లిదండ్రులను విచారించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం మిస్బాకు జ్వరం తీవ్రమైందన్నారు. అంతకు ముందురోజు చికిత్స చేసిన డాక్టర్ ఆసుపత్రిలో లేడని తెలిసి, ఆయన నివాసానికే వెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది సెలైన్ బాటిల్ ఎక్కిస్తారని చెబితే వెంటనే వెళ్లామన్నారు. అక్కడ స్వీపర్ మాబున్నీ తప్ప ఎవరూ లేరని, తనే సెలైన్ బాటిల్ ఎక్కించారని చెప్పారు. కొద్దిసేపటికి స్టాఫ్ నర్సు విజయలక్ష్మీ వచ్చి సెలైన్‌లో ఇంజెక్షన్ వేసి తనకు పని ఉందంటూ వెళ్లిపోయారన్నారు. స్వీపర్ పర్యవేక్షణలోనే చికిత్స జరిగిందని వివరించారు. ఆ రోజు ఊళ్లో వారపు సంత ఉండడంతో అక్కడికెళ్లేందుకు స్వీపర్ సెలైన్ వేగం పెంచిందని, ఆ ప్రభావంతో ఒక్కసారిగా మిస్బా ఒళ్లంతా చల్లగా మారి ఫిట్స్ వచ్చి మరణించిందని కన్నీరు పెట్టుకున్నారు. ఉన్న ఒక్కగానొక్క బిడ్డను దూరం చేసి కడుపుకోత మిగిల్చారన్నారు. ఆసుపత్రిలో డాక్టర్ డ్యూటీ సరిగా చేయరని, ఉదయం 10.30కు వచ్చి మధ్యాహ్నం 12.30 గంటలకు వెళ్లిపోతారని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లో వీరిని ఇక్కడ ఉంచొద్దని, వారు తమ కళ్ల ముందు ఉంటే పాపను లేకుండా చేశారనే బాధ తమకు గుర్తుకొస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని, ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకొంటామని తెలిపారు.

అధికారులు గ్రామాలకు వెళ్లాల్సిందే

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో పనిచేస్తున్న వివిధ శాఖలకు చెందిన అధికారులందరూ తరచూ గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను అంచనా వేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం 'సాక్షి'లో 'సమావేశాలతోనే సరి.. పర్యటనలు హరీ' అన్న శీర్షికన వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. నిర్ణయించిన మేరకు కొన్ని సమావేశాలు సకాలంలో జరగకపోవడం వల్ల అవన్నీ నిర్వహించాల్సి రావడంతో అధికారులు హాజరు కావాల్సి వచ్చిందన్నారు. ఇకపై అవసరం లేకుండా ఏ అధికారీ సమావేశానికి రావాల్సిన పని లేదన్నారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో పనుల ఒత్తిడి కారణంగా కొన్ని ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం జరిగి ఉండవచ్చునని, ఇకపై ఎక్కడా ఫైళ్ల జాప్యం చేయకూడదని అధికారులకు ఆదేశాలిస్తానన్నారు. రెండు వారాల్లో అధికారుల బదిలీలు పూర్తవుతాయన్నారు. ఆ తర్వాత ప్రతి విభాగంతోనూ ప్రత్యేక సమీక్షలు నిర్వహించి కార్యాచరణ దిశగా అడుగులు వేస్తామన్నారు. ఇప్పటికే తహసీల్దార్లు, పోలీసు సిబ్బంది బదిలీలు పూర్తయ్యాయన్నారు. టీచర్ల సర్దుబాటు ప్రక్రియ జరుగుతోందన్నారు. అన్నీ పూర్తయితే పూర్తి స్థాయిలో పాలనపై దృష్టి సారిస్తామన్నారు. ప్రతి ఒక్క అధికారి పారదర్శకంగా పనిచేసి ప్రతి ఒక్కరి సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఎవరికైనా ఏవైనా సమస్యలుంటే ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమంలో తనకు నేరుగా చెప్పుకోవచ్చునన్నారు. వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ వెల్లడించారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు నేడు కౌన్సెలింగ్

అనంతపురం సిటీ: గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించి అనంతపురంలోని పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఎస్ఈ కేవీకేవీ ప్రసాద్ గురువారం తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మొత్తం 104 ఖాళీలు ఉండగా, 252 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. దరఖాస్తు చేసుకుని కౌన్సెలింగ్‌కు హాజరు కాకపోతే అటువంటి వారికి బదిలీలు ఉండవని స్పష్టం చేశారు.

అందుబాటులో పప్పుశనగ నూతన వంగడం

బుక్కరాయసముద్రం: పప్పుశనగలో నూతన వంగడమైన నంద్యాల గ్రామ్ ఎన్‌బీఈజీ-452 విత్తనం రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉంచినట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత డాక్టర్ మల్లేశ్వరి తెలిపారు. క్వింటా ధర రూ. 11 వేలు అని తెలిపారు. నంద్యాల గ్రామ్-452 పంట కాలం 90-105 రోజులు, దిగుబడి వర్షాధారంగా ఎకరానికి 8-10 క్వింటాలు, ఒకటి రెండు నీటి తడులతో 10-12 క్వింటా వస్తుందన్నారు. ఎండు తెగులు తట్టుకునే శక్తి ఉందన్నారు. జేజీ-11కు మంచి ప్రత్యామ్నాయమన్నారు.పూర్తి వివరాలకు, విత్తనం కోసం 7013571755, 9052557119, 7032058368, 9989623825 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

జీతాల కోసం జలదీక్ష



పెన్నానదిలోకి దిగి నిరసన తెలుపుతున్న సత్యసాయి కార్మికులు

గార్లదిన్నె: మండల పరిధిలోని కల్లూరులో గురువారం సత్యసాయి కార్మికులు పెన్నానదిలో జల దీక్ష చేసి సమ్మె చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 నెలల నుంచి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు జీతాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి కార్మికులు నాగభూషణ, మల్లరాయుడు, జనార్దన్ రెడ్డి, శ్రీనివాసులు, సాంబశివ, ఈశ్వరయ్య, శంకర్ పాల్గొన్నారు.

కరెంటు అంతరాయంపై రోడ్డెక్కిన జనం



ధర్నా చేస్తున్న సంత మార్కెట్ వీధి నివాసులు

పామిడి: విద్యుత్ సరఫరాలో అంతరాయంపై స్థానిక 18 వార్డులోని నారాయణస్వామి వీధి (సంత మార్కెట్ వీధి) వాసులు భగ్గుమన్నారు. గురువారం ఉదయం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. తమ వీధికి ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో రోజంతా కరెంటు లేక తీవ్ర ఇబ్బంది పడ్డామన్నారు. తరచూ ఇలాంటి పరిస్థితులే చవి చూస్తామన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేదాకా ఆందోళన విరమించేది లేదన్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులతో పాటు పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు.



చట్టాల్లో మార్పులు తేవాలి

"గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న మహిళా వైద్యాధికారులకు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి రోగుల ప్రాణాలను కాపాడిన వైద్య వృత్తిలో ఉన్న వారికే ఇప్పుడు రక్షణ కరువైంది. పని ఒత్తిడి ఎక్కువైనా చిరునవ్వుతోనే వైద్యం అందిస్తున్నాం. రోగులతో వచ్చిన కొందరు వ్యవహరిస్తున్న తీరుతో భయాందోళనకు గురవుతున్నాం. మద్యం మత్తులో వచ్చే వారితో చాలా ఇబ్బందిగా ఉంటోంది. దాడులు చేస్తే కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం చట్టాల్లో మార్పులు తేవాలి.

– బాలగొండ సునీత, ఏఎన్ఎం, ప్రసన్నాయపల్లి సచివాలయం–1, రాప్తాడు మండలం





కోల్‌కతా ఘటన బాధాకరం

కోల్‌కతాలో వైద్యురాలి హత్య ఘటన అనంతరం బయటకు రావాలంటే భయం వేస్తోంది. మహిళా వైద్యులు, ఉద్యోగులకు భద్రత పెంచాలి. మేము ఒకరిని బతికించడానికి పని చేస్తాం తప్ప కీడు చేయం. గతంలో వైద్యులను దేవుడిగా పూజించే వారు. నేటి సమాజంలో వైద్యులకు తగిన గుర్తింపు లభించడం లేదు. మనిషి ప్రాణాలను రక్షించే వైద్యులపై దాడులు పెరిగిపోయాయి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మృతి చెందిన జూనియర్ వైద్యురాలి ఆత్మశాంతి కలగాలంటే నిందితులకు కఠిన శిక్ష పడాలి."

– చంద్రకళ, ఏఎన్ఎం, ప్రసన్నాయపల్లి సచివాలయం–2, రాప్తాడు మండలం

క్రికెట్ పండుగకు సర్వం సిద్ధం

- సెప్టెంబర్ 5 నుంచి అనంతపురంలో క్రికెట్ సందడి
- దులీప్ ట్రోఫీ బరిలో 45 మంది టాప్ క్రికెటర్లు
- ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంఛో ఫెర్రర్



ముస్తాబైన ఏసీజీలోని ప్రధాన మైదానం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాంఛో ఫెర్రర్

అనంతపురం కార్పొరేషన్: 'అనంత వేదికగా క్రికెట్ పండుగకు సర్వమూ సిద్ధమైంది. దేశవాళీ క్రికెట్‌లో ప్రఖ్యాతిగాంచిన దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు అనంత క్రీడా గ్రామం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. దాదాపు 20 నుంచి 25 రోజుల పాటు క్రికెట్ సందడి ఉంటుంది. జిల్లాలో తొలిసారి ఓ పెద్ద టోర్నీ నిర్వహణకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకున్న బీసీసీఐకు ప్రత్యేక కృతజ్ఞతలు. జిల్లా వాసులు, క్రీడాభిమానుల సహకారంతో క్రికెట్ టోర్నీ విజయవంతం చేస్తాం' అని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) త్రీమెన్ కమిటీ సభ్యులు, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ అన్నారు. అనంతపురం క్రికెట్ గ్రౌండ్ (ఏసీజీ) ఆటోరియంలో దులీప్ ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ క్రికెట్ టోర్నీల తర్వాత అదే స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా దులీప్ ట్రోఫీను బీసీసీఐ నిర్వహిస్తోందన్నారు. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న శుభమన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, కేఎల్ రాహుల్, శివమ్ దూబే, రిషబ్‌పంత్, మయాంక్ అగర్వాల్, శ్రేయస్ అయ్యర్, కులదీప్ యాదవ్, ఇషాన్ కిషన్, అక్షర్‌పటేల్, అర్ష్‌దీప్ సింగ్, తదితర దేశంలోనే టాప్ 45 మంది క్రీడాకారులు ఈ ట్రోఫీలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో క్రీడాకారుల భద్రతకు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ తదితర అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారన్నారు. వచ్చే నెల 5 నుంచి 22వ తేదీ వరకూ ఏసీజీలోని రెండు మైదానాల్లో ఐదు మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. ఒక్కో మ్యాచ్ నాలుగు రోజుల పాటు (టెస్ట్ మ్యాచ్) ఉంటుందన్నారు. వచ్చే నెల 5న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో భారత్ ఏ, బీల మధ్య, అదే రోజున అనంతపురంలో సీ, డీ జట్ల మధ్య మ్యాచ్‌తో దులీఫ్ ట్రోఫీ మొదలవుతుందన్నారు.

ప్రత్యక్ష వీక్షణకు 4వేల మందికి అవకాశం

ఈ మ్యాచ్‌లు వీక్షించేందుకు రోజూ 4 వేల మందికి పాస్‌లు అందజేస్తున్నట్లు మాంఛోఫెర్రర్ తెలిపారు. మాచ్‌ల వీక్షణ ఉచితం మాత్రం కాదని స్పష్టం చేశారు. ఈ నెల 31న ఉదయం 11 గంటలకు ఏసీజీలో పాస్‌ల పంపిణీ ఉంటుందన్నారు. రోజూ కౌంటర్ ఉంటుందన్నారు. ఒకరికి ఒక పాస్ మాత్రమే ఇస్తామన్నారు. మ్యాచ్‌లు జరిగే రోజున ఉదయం 8.30 గంటలకు గ్రౌండ్‌లో ప్రవేశముంటుందని, 10.30 గంటలకు గేట్లు మూసివేస్తారన్నారు. పార్కింగ్ ఏసీజీ లోపల ఉంటుందన్నారు. ఏసీజీలో జరిగే ప్రతి మ్యాచ్ స్టార్ స్పోర్ట్స్, జియోలో ప్రత్యక్ష ప్రసారం అవుతాయన్నారు. సమావేశంలో టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి, మాజీ రంజీ క్రీడాకారుడు షాబుద్దీన్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మీడియా మేనేజర్ రాజగోపాల్, అనంతపురం క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు ఆచారి, సభ్యులు పగడాల మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

'సమగ్రశిక్ష'లో ఎట్టకేలకు నేడు స్క్రూటినీ

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష కార్యాలయంలోని సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీలో భాగంగా ఎట్టకేలకు శుక్రవారం దరఖాస్తులను స్క్రూటినీ చేయనున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న వారిని గత నెల 31న ఆఘమేఘాల మీద కలెక్టర్ ద్వారా రిలీవ్ చేయించిన విద్యాశాఖ అధికారులు.. వారు రిలీవ్ కాకుండానే ఆ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ కూడా ఇచ్చేశారు. 110 దరఖాస్తులు వచ్చాయి. స్క్రూటినీ చేయకుండా పక్కన పెట్టేశారు. ఇందుకు ప్రధాన కారణమైన ఓ అధికారిపై కలెక్టర్ సీరియస్‌గా ఉండడమే అని తెలిసింది. సెక్టోరియల్ అధికారులు లేక సమగ్ర శిక్ష అస్తవ్యస్తంగా మారడంతో 'సాక్షి'లో ఈనె 28న 'కుంటుపడుతున్న విద్యాభివృద్ధి' శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన అధికారులు విషయాన్ని మరోమారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అనుమతులు తీసుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ప్రత్యేక బృందం ద్వారా స్క్రూటినీ చేయనున్నారు. బృందంలో ఏడుగురు సభ్యులున్నారు. డిప్యూటీ డీఈఓలతో పాటు ఎంపిక చేసిన హెచ్ఎంలు, సమగ్రశిక్ష సూపరింటెండెంట్ ఉన్నారు.

పురాతన ఆలయం పరిశీలన

కుందుర్పి: మండల కేంద్రంలోని భంభంబాబా ఆలయ సమీపంలో ఉన్న పురాతన ఆలయాన్ని గురువారం పురావస్తు శాఖ ఏడీ రజిత, విశ్రాంత డీడీ విజయ్‌కుమార్ పరిశీలించారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మితమైన ఈ ఆలయానికి నాగబంధం ఉన్నట్లుగా నిర్ధారించారు. ఆలయానికి పూర్తిస్థాయి పోలీస్ భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా వారి వెంట గ్రామస్తులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

రైలు రద్దు పొడిగింపు

రాయదుర్గంటౌన్: తిరుపతి – కదిరిదేవరపల్లి ప్యాసింజర్ రైలు రద్దును మరో నెల రోజుల పాటు పొడిగించారు. ఈ నెల 31 వరకు ఉన్న రద్దును అక్టోబర్ 1వ తేదీ వరకూ పెంచారు. ఈ మేరకు రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

భాషా పురస్కారాల్లో తీరని అన్యాయం

- సీమ వాసులకు మొండి చెయ్యి చూపిన కూటమి సర్కార్
- గత ప్రభుత్వంలో అనంత సాహిత్యానికి అరుదైన గౌరవం

అనంతపురం కల్చరల్: నేతి బీరలో నెయ్యి ఉంటుందని భ్రమ పడేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. తెలుగు భాషా దినోత్సవ పురస్కారాల ప్రకటనలో వివక్ష కనబరుస్తూ తన నైజాన్ని బయట పెట్టింది. గిడుగు రామ్మూర్తి పంతులు పేరుతో వెల్లడించిన భాషా పురస్కారాల ఎంపికలో 'అనంత'కు తీరని అన్యాయం చేసింది. ఈ ఏడాదికి రాష్ట్ర వ్యాప్తంగా 19 మందిని భాషా సేవాపురస్కారాలకు, మరో 21 మందిని కవి సమ్మేళనానికి చంద్రబాబు సర్కార్ ఎంపిక చేస్తే అందులో కేవలం రెండు మూడు జిల్లా వారే ఉండడం గమనార్హం. ఇక సీమ మొత్తానికి భాషా పురస్కారాలకు కేవలం చిత్తూరు జిల్లా (సీఎం సొంత జిల్లా)లో పలమనేరు బాలాజీ, మూలే విజయలక్ష్మి మాత్రమే ఉన్నారు. గతంలోనూ వీరు ఇవే పురస్కారాలనందుకోవడం భాషాభిమానులను విస్మయానికి గురి చేసింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికీ సమతూకం పాటిస్తూ భాషా, సాహిత్య రంగాల్లో విశేష కృషి చేస్తున్న వారిని గుర్తించి, వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారంతో పాటు రూ.10 లక్షల పారితోషకాన్ని అందజేశారు. అలాగే గత జనవరి 9న అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో సీనియర్ రచయితల సహకారంతో అనంతలో తెలుగు భాషా పురస్కారాలను అందించారు. ఆ సమయంలో ఏకంగా 41 మందిని ఒకేసారి అవార్డులతో సత్కరించడం రాష్ట్ర సాహితీ చరిత్రలో ముందెన్నడూ జరగలేదు.

అనంత సాహిత్యానికి చిన్నచూపు



అనంత సాహిత్యానికి నిజంగా ప్రభుత్వ పెద్దలు చిన్న చూపు చూశారు. భాషా పురస్కారాలను ప్రహసనంగా మార్చేయడం ద్వారా అనంతకు తీరని అన్యాయమే జరిగింది. ప్రాంతాల సమతూకం, సామాజిక న్యాయం కరువైంది. భాషా, సాహిత్య రంగాల వారినే కాకుండా ఇతర రంగాల వారినీ ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారో అర్థం కావడం లేదు.

– చెట్ల ఈరన్న, సాహితీ అభిమాని, అనంతపురం

వివక్ష మంచిది కాదు



గిడుగు భాషా పురస్కారాల పేరుతో ప్రభుత్వం ముప్పాతిక భాగం రాయలసీమను విస్మరించడం సబబు కాదు. చిత్తూరులో ఇద్దరు మినహా తతిమా మొత్తం సీమకు అన్యాయం జరిగింది. ఇప్పటికే రాయలసీమ వాసులు అన్నింటిలో నష్టపోయామన్న భావనలో ఉన్నారు. ప్రాంతీయ అస్తిత్వ భావాలు తెలుగునాట ప్రబలంగా ఉన్న సమయంలో సమతుల్యత పాటించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ప్రాంతీయ వైరుధ్యాలు పెరగడానికి ఇవే కారణమవుతాయి. ఇందుకు బాధ్యులెవరో ప్రభుత్వం గుర్తించి మరోసారి పునరావృతం కాకుండా చూడాలి.

– ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

అంబేడ్కర్ గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో (అంబేడ్కర్ గురుకులాలు) 5 నుంచి 8వ తరగతి వరకూ సెక్షన్‌కు ఐదు చొప్పున అదనంగా పెరిగిన సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ మురళీకృష్ణ గురువారం ప్రకటన విడుదల చేశారు. కురుగుంటలో 20 సీట్లు, తిమ్మాపురంలో 19, ఉరవకొండలో 16, గుత్తిలో 29, బ్రహ్మసముద్రంలో 19, కణేకల్లులో 25, బి. పప్పూరులో 39 మొత్తం 189 సీట్లకు శుక్రవారం, శనివారం (30, 31 తేదీలు) దరఖాస్తు చేసుకోవాలి. 5వ తరగతిలో 80 అదనపు సీట్లను బీఆర్ఏజీసెట్–2024 పరీక్షలో మెరిట్ విద్యార్థులతో భర్తీ చేస్తారు. 6 నుంచి 8 వ తరగతి అదనపు సీట్లను ఆయా పాఠశాలల్లో సెప్టెంబర్ 1న ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ విద్యార్థులతో భర్తీ చేస్తారు. పూర్తి వివరాలకు అంబేడ్కర్ గురుకులం లేదా డీసీఓ కార్యాలయంలో (సెల్ 99493 54106) సంప్రదించవచ్చు.

ఎరికలయ్య కుటుంబానికి ఆర్థిక సాయం



ఎరికలయ్య కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున ఆర్థిక సాయం అందజేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

పుట్లూరు: పార్టీ నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని, ఈ విషయంగా ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదని శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేత ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. జూన్ 17న టీడీపీ నాయకులు రాళ్లతో దాడి చేయడంతో పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎరికలయ్య తీవ్రంగా గాయపడి బెంగుళూరులో చికిత్స పొందుతూ అదే నెల 27న మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ స్పందించారు. రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో మంజూరు చేయడంతో హతుడి భార్య పుల్లమ్మకు గురువారం ఉదయం ఆలూరు సాంబశివారెడ్డి అందజేశారు. అలాగే తనవంతు సహాయంగా రూ.లక్షను నగదు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రాఘవరెడ్డి, సర్పంచ్ రామకృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, నాయకులు రమణాయాదవ్, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్రం ప్రాంతాన్ని పరిశీలించిన పురావస్తు శాఖ అధికారులు



అభయాంజనేయస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న పురావస్తు శాఖ ఏడీ రజిత, తదితరులు

పామిడి: స్థానిక ఎద్దులపల్లి రోడ్డులో టీడీపీ నేతలు కూల్చివేసిన పురాతన అభయాంజనేయ స్వామి సత్రం, ఆలయాన్ని పురావస్తు శాఖ ఏడీ రజిత, సాంకేతిక నిపుణుడు మహేంద్రనాయుడు, విశ్రాంత డీడీ విజయ్‌కుమార్ జాదవ్, చరిత్ర పరిశోధకుడు రమేష్ తదితరులు గురువారం పరిశీలించారు. అక్కడున్న శాసనాలను బట్టి శాతవాహనుల కాలం నాటిదిగా నిర్ధారించారు. 1926లో ఆలయం పునఃనిర్మాణం జరిగినట్లుగా శిలాఫలకం ఉందన్నారు. అనంతరం టంగుటూరి కుటుంబీకులతో వారు చర్చించారు. తమ సొంత పట్టాభూమిలో అప్పట్లో అభయాంజనేయస్వామి ఆలయాన్ని పెద్దలు నిర్మించినట్లుగా వారు వివరించారు. ఈ క్రమంలో సత్రం నేలమట్టం చేయడం, ప్రహరీని తొలగించడంపై నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేయనున్నట్లు రజిత పేర్కొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

వివాహ బంధంతో ఒక్కటైన వారి బంధం జీవన పయనంలోనూ అంతే అనుబంధంగా సాగింది. పెళ్లి సమయంలో నాతిచరామి అంటూ జీవితాంతం కలసి ఉంటామని ప్రమాణం చేసిన ఆ దంపతుల బంధం మృత్యువులోనూ వీడలేదు. గంటల వ్యవధిలోనే కుటుంబ పెద్దలు మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. అలాగే ఒకే తల్లి కడుపున పుట్టిన అన్నదమ్ములనూ ప్రమాదం రూపంలో మృత్యువు కబలించింది. జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఘటనలతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

- డెంగీ బారిన పడి భార్య మృతి
- విషయం తెలియగానే గుండెపోటుతో కన్నుమూసిన భర్త
- మరో ప్రమాదంలో అన్నదమ్ముల మృతి



పంపాపతి, శివగంగమ్మ (ఫైల్)



సాయి, చిన్న (ఫైల్)

రాయదుర్గం(డి హీరేహాళ్): డి.హీరేహాళ్ మండలం మురడి గ్రామ పంచాయతీ పరిధిలోని నల్లదిబ్బ గ్రామానికి చెందిన గొల్ల శివగంగమ్మ (59), పంపాపతి (68) దంపతులకు ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో కుమార్తె ఏకాంతమ్మ అనంతపురంలో నర్సింగ్ కోర్సు చేస్తోంది. కుమారుడు లోకానంద కూడా అనంతపురంలోని హాస్టల్‌లో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. మరో కుమారుడు బసవరాజు వైకల్యంతో బాధపడుతుండడంతో ఇంటి పట్టునే ఉంటున్నాడు. కొన్ని రోజుల క్రితం జ్వరం బారిన శివగంగమ్మకు బళ్లారిలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. డెంగీ జ్వరంతో బాధపడుతున్నట్లు అక్కడి వైద్యులు నిర్ధారించి, చికిత్స అందజేస్తున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం ఆమె మృతి చెందింది. భార్య మరణవార్త విని తట్టుకోలేని భర్త కుమిలి కుమిలి ఏడుస్తూ గుండెపోటుకు గురై మృతి చెందాడు. గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులు మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు. విషయం తెలియగానే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గుండెలవిసేలా రోదిస్తున్న పిల్లలు ఓదార్చడం ఎవరితరం కాలేదు. నిరుపేద రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అన్నదమ్ములను బలిగొన్న ప్రమాదం

పామిడి: స్థానిక 44వ జాతీయ రహదారిపై క్రూజర్ వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న అన్నదమ్ములు మృతిచెందారు. పోలీసులు తెలిపిన మేరకు... మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాకు చెందిన 25 మంది బతుకు తెరువు కోసం క్రూజర్ వాహనంలో కేరళకు బయలుదేరారు. పామిడిలోని చైతన్య కాలనీ సమీపంలోకి చేరుకోగానే అప్పటికే ఓ ఫంక్షన్‌లో ఫొటోలు తీసి స్వగ్రామం కల్లూరుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న అన్నదమ్ములు చిన్న (28), సాయి (26) రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను ఢీకొనడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు మధ్యలోకి వచ్చింది. అదే సమయంలో వెనుకనే వస్తున్న క్రూజర్ ఢీకొనడంతో అన్నదమ్ములిద్దరూ రోడ్డు పక్కన పల్లంలోకి పడ్డారు. చిన్నా అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సాయిని స్థానికులు హుటాహుటినా పామిడిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, ప్రమాదంలో క్రూజర్ అదుపు తప్పి రోడ్డు పక్కన పల్లంలోకి దూసుకెళ్లింది. క్రూజర్ డ్రైవర్‌తో పాటు మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుల్లో చిన్నాకు భార్య ఉంది. సాయికి భార్యతో పాటు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రాజశేఖరరెడ్డి తెలిపారు.

పెళ్లికి వెళుతూ.. పరలోకాలకు

- ఒకరి దుర్మరణం... మరొకరి పరిస్థితి విషమం



మృతుడు వీరేష్

ఉరవకొండ: స్నేహితుడి పెళ్లికని బయలుదేరిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా... మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని బళ్లారికి చెందిన వీరేష్, గోవిందరాజులు గురువారం అనంతపురంలో జరుగుతున్న తమ స్నేహితుడి వివాహ వేడుకలో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. స్పీడ్ తగ్గించాలని పదేపదే గోవిందరాజులు సూచించినా వాహనాన్ని నడుపుతున్న వీరేష్ పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఉరవకొండ మండలం కోనాపురం గ్రామ సమీపంలోకి చేరుకోగానే నియంత్రణ కోల్పోవడంతో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వీరేష్ (20) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న గోవిందరాజులును స్థానికులు వెంటనే ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. కాగా, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై ఉరవకొండ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

5 నుంచి నిరవధిక సమ్మె

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం అర్బన్: శ్రీసత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికుల వేతన, పీఎఫ్ బకాయిలు చెల్లించడంతో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తాగునీటి పథకాల కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ఓబులు మండిపడ్డారు. సమస్య పరిష్కారానికి సెప్టెంబరు 5వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. గురువారం స్థానిక జేవీవీ కార్యాలయంలో తాగునీటి పథకం కార్మికుల సంఘం సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. కార్మికుల నిరవధిక సమ్మె కారణంగా తలెత్తే సమస్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఏసురత్నం, ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణుడు, నాయకులు గోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, తిప్పేస్వామి, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

బెళుగుప్ప: కుటుంబ కలహాల నేపథ్యంలో కన్నతండ్రినే హతమార్చిన కేసులో నిందితులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్ఐ శివతో కలసి సీఐ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. ఈనెల 27న యలగలవంక గ్రామానికి చెందిన తిప్పేస్వామి నాయక్(53) హత్య జరిగిన విషయం తెలిసిందే. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో గురువారం ఉదయం గుండ్లపల్లి క్రాస్ వద్ద తచ్చాడుతున్న హతుడి కుమారుడు రాజశేఖర్ నాయక్, తిప్పేస్వామి నాయక్ భార్య లక్ష్మీబాయిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో నేరం తామే చేశామని అంగీకరించారు. మద్యానికి బానిసలైన తండ్రి, కొడుకు తరచూ గొడవలు పడేవారని, అంతేకాక అప్పులు కూడా ఎక్కువ కావడంతో కొంత భూమిని తిప్పేస్వామినాయక్ విక్రయించాడు. దీంతో కుటుంబంలో గొడవలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 27న ఘర్షణ పడిన కొడుకు, తల్లి.. పథకం ప్రకారం తిప్పేస్వామినాయక్‌ను గొంతు నులిమి హతమార్చారు. నిందితులపై చార్జ్‌షీట్ దాఖలు చేసి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

దేశ భాషలందు తెలుగు లెస్స

అనంతపురం కల్చరల్/రాప్తాడు/ఆత్మకూరు/అనంతపురం రూరల్: అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని అనంత రచయితలు, కవులు ఘనంగా జరుపుకున్నారు. తొలుత సప్తగిరి సర్కిల్ నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకూ ర్యాలీ చేపట్టారు. మేయర్ వసీం, తదితరులు తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలో వివిధ కళాశాలలు, స్కూళ్లలో గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు నివాళులర్పించారు. రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకున్నారు. తెలుగు వెలుగు సంస్థ వారు అందించే జాతీయ నంది పురస్కారానికి ఆచార్య సుధాకర బాబు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 15న విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో పురస్కారం అందజేయనున్నారు. కళ్యాణదుర్గం రోడ్డులోని సెయింటాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఆచార్యులు బాలసుబ్రహ్మణ్యం, జిల్లా రచయిత సంఘం గౌరవాధ్యక్షుడు నబి రసూల్ తదితరులు పాల్గొన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.


తెలుగు తల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం


ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

నగరాభివృద్ధికి పాటుపడాలి


మాజీ ఎమ్మెల్యే అనంతను కలిసిన కార్పొరేటర్లు

అనంతపురం కార్పొరేషన్: నగరాభివృద్ధికి పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కాబోయే స్టాండింగ్ కమిటీ సభ్యులకు సూచించారు. స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం కానున్న సందర్భంగా గురువారం మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తొలిసారిగా సభ్యులుగా అవకాశం కల్పించినందుకు వారు మాజీ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేకు మిఠాయిలు అందించారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చొరవ చూపాలన్నారు. కాబోయే స్టాండింగ్ కమిటీ సభ్యులు మల్లెమీద నరసింహులు, రహంతుల్లా, అనిల్‌కుమార్ రెడ్డి, సుజాత, నాగవినూతలు మాట్లాడుతూ.. తొలిసారిగా అవకాశం కల్పించినందుకు మాజీ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి

అనంతపురం సెంట్రల్: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. గురువారం నగరంలో రద్దీ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలించారు. సప్తగిరి సర్కిల్, సూర్యనగర్ జంక్షన్, శ్రీకంఠ సర్కిల్, టవర్‌క్లాక్, కళ్యాణదుర్గం బైపాస్, తపోవనం కూడళ్లలో ట్రాఫిక్ ఇబ్బందులను చూశారు. జీబ్రాలైన్లు, ఫ్రీ లెఫ్ట్‌ల కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆటో యూనియన్ నాయకులతో మాట్లాడి ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రఘు ప్రసాద్, నాల్గవ పట్టణ సీఐ సాయినాథ్, ఆర్‌ఐ మధు తదితరులు పాల్గొన్నారు. పోలీసు ప్రీ ప్రైమరీ రక్షక్ పాఠశాల, సీపీసీ క్యాంటీన్, రామాలయం, షాదీఖానా, దర్గా, చర్చిలను సందర్శించారు. అలాగే కమాండ్ కంట్రోల్‌రూం, డయల్ 100, సైబర్ క్రైం, టీవీ వాచ్ రూంలను తనిఖీ చేశారు. ఆయా విభాగాల పనితీరు, నిర్వహణపై సమీక్షించారు.

ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్‌కు అవార్డు

అనంతపురం రూరల్: హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఎడ్యూలీడర్స్ సమ్మిట్‌లో ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ అరుణ్ కుమార్‌రెడ్డికి ఎడ్యుకేషన్ ఐ కాన్ ఆఫ్ ది ఇయర్–2024 అవార్డు దక్కినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి తెలిపారు. తమ స్కూల్‌కు అవార్డు రావడం సంతోషించ దగ్గ విషయమన్నారు.

వ్యాయామం అలవాటు చేసుకోండి


ట్రాన్స్‌జెండర్‌కు రూ.4,000 చెక్కు అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కార్పొరేషన్: ప్రతి ఒక్కరూ రోజూ గంట పాటు వ్యాయామం అలవాటు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా గురువారం నగరంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో భాగస్వామ్యం కావాలన్నారు. యోగా, వ్యాయామం, ఇతర క్రీడలను ఎంచుకుని ఫిట్‌గా ఉండాలన్నారు. వియాత్నంలో చాలా మంది ఉదయం 6 గంటల నుంచి వ్యాయామం చేస్తుంటారన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

ఆత్మకూరు/రాప్తాడు/అనంతపురం సెంట్రల్: అనంతపురం, ఆత్మకూరు, రాప్తాడులో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అందకుముందు క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో జేఎన్‌టీయూ ఓఎస్డీ దేవన్న, కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నగరపాలక సంస్థ కమిషనర్‌గా నాగరాజు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కమిషనర్‌గా జి.నాగరాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్టణంలో ఆర్‌డీఎంఏగా విధులు నిర్వర్తిస్తున్న ఈయన బదిలీపై అనంతపురం రానున్నారు. ప్రస్తుతం అనంతపురం నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ఉన్న పీవీవీఎస్ మూర్తి మునిసిపల్ ఆర్‌డీగానే కొనసాగనున్నారు. అదేవిధంగా నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా ఉన్న పి.శ్రీహరిబాబును చిలకలూరిపేట మునిసిపల్ కమిషనర్‌గా నియమించారు.

ది ట్రెల్లిస్ స్కూల్‌కు అవార్డు



మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ట్రెల్లిస్ స్కూల్ చైర్మన్ శ్రీకాంత్

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ది ట్రెల్లిస్ స్కూల్ ప్రతిష్టాత్మక టైమ్స్ ఆఫ్ ఇండియా నుంచి ఎక్సలెన్స్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్ అవార్డు దక్కించుకుంది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా ట్రెల్లిస్ స్కూల్ వ్యవస్థాపకుడు, చైర్మన్ శ్రీకాంత్ వద్ద అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టైమ్స్ ఆఫ్ ఇండియా నుంచి ఎక్సలెన్స్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్ అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టండి

అనంతపురం అర్బన్: జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియేట్ ప్రవేశాలకు సంబంధించిన చేపట్టిన ప్రక్రియలో చోటు చేసుకున్న అవినీతిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దళిత ప్రజా విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా గురువారం ఉదయం దళిత ప్రజా సంఘాల నాయకులు ర్యాలీగా వచ్చి కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించారు. అప్పటికే అక్కడ బందోబస్తుగా ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించండి

అనంతపురం అర్బన్: సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు డిమాండ్ చేశారు. ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలపై గురువారం కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రిలే దీక్ష ప్రారంభించారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గురుప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్), లైవ్ స్టాక్ మేనేజ్మెంట్ అండ్ డైరీయింగ్, సివిల్ ఇంజినీరింగ్ టెక్నీషియన్ కోర్సులకు అధ్యాపకుల అవసరం ఉందన్నారు. శుక్రవారం లోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 89853 40661 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

అనంతపురం మెడికల్: వారంలో ఒక రోజు డ్రైడే పాటించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. తద్వారా దోమలు వృద్ధి చెందవని జిల్లా మలేరియా అధికారి ఓబులు పేర్కొన్నారు. గురువారం ఏ.నారాయణపురం పరిధిలోని సుఖ్‌దేవ్‌నగర్‌లో పర్యటించారు. నీటి తొట్టెలు, తదితర వాటిని నిశితంగా పరిశీలించి, దోమ లార్వాలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

కలెక్టర్ సార్ కరుణించారు

- సాక్షి కథనానికి స్పందన
- రివాల్వింగ్ గేట్ తెరవాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని గర్భిణులు, బాలింతలు, రోగులు, వారి సహాయకులు, ఉద్యోగులపై కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ కరుణించారు. గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రివాల్వింగ్ గేట్ మూసి వేయడంతో గర్భిణులు, బాలింతలు, తదితరులు పడుతున్న ఇబ్బందులను ఎత్తి చూపుతూ సాక్షిలో కలెక్టర్ సారూ కరుణించరూ కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. శుక్రవారం నుంచి రివాల్వింగ్ గేట్ తెరిచేలా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావును ఆదేశించారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆస్పత్రి వెనుక వైపు ఉన్న రివాల్వింగ్ గేట్ తెరవాలన్నారు. ఆ తర్వాత ఆస్పత్రి భద్రతా చర్యల్లో భాగంగా రివాల్వింగ్ గేట్ మూసి వేయాలని స్పష్టం చేశారు. కలెక్టర్ స్పందనపై ఆస్పత్రి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

15లోపు ఈ-క్రాప్ చేయించుకోండి


రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

ఆత్మకూరు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు సెప్టెంబర్ 15లోపు పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. గురువారం ఆత్మకూరులోని జువారి ఫాం హబ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టాక్ తనిఖీ చేశారు. ప్రతి ఒక్క ప్రాజెక్టుకు సంబంధించి బిల్లులను రైతులకు తప్పనిసరిగా అందించాలని సూచించారు. అనంతరం వ్యవసాయ అధికారులతో మాట్లాడుతూ.. ఈ-పంట నమోదులో భాగంగా ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓలు సుచరిత, వెంకట్‌కుమార్, పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు సాయం

అనంతపురం సెంట్రల్: కేరళ వయనాడ్ బాధితుల కోసం ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విరాళాలు సేకరించారు. గురువారం సుభాష్ రోడ్డులోని టౌన్ బ్యాంక్‌లో చైర్మన్ జేఎల్ మురళీ సమక్షంలో విరాళాలు లెక్కించగా.. రూ.15,272 సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు సుంకర రమేష్, బ్యాంక్ వైస్ చైర్మన్ వెంకటాద్రి, డైరెక్టర్లు పాల్గొన్నారు.